# శంతనుడు

గంగా నదీతీరంలో ఉన్న అడవుల్లో వేటకు వెళ్ళాడు శంతన మహారాజు. అతనికి వేటంటే వ్యామోహం. అలా సంచరిస్తూ అడవిదాటి గంగా నదీతీరానికి వచ్చాడు. నీటిపైనుంచి వచ్చే చల్లనిగాలి అతని మనసుకి ఉల్లాసాన్ని కలిగించింది. నది ఒడ్డున ఇసుక తిన్నెలపైన నిలబడ్డాడు ప్రశాంతమైన ప్రకృతిని తిలకిస్తూ.

ఆ ఏకాంతాన్ని చెడగొట్టి - తనవైపే చూస్తూ నడిచివస్తున్న స్త్రీమూర్తిని గమనించి విస్తుపోయాడు శంతనుడు. కీకారణ్యాల నానుకుని ఉన్న ఈ తీర ప్రాంతంలో ఒంటరిగా ఒక స్త్రీ విహరించడమా? ఇది కలా-నిజమా? శంతనుడు అలా అనుకుంటూండగానే ఆ స్త్రీ మరీ దగ్గరవుతోంది. సర్వాలంకార భూషిత ఆమె. ఆమె బిగువైన వక్షోజాలు, సన్నని నడుము ఆ సౌందర్యాన్ని మరీ అతిశయింప జేశాయి. కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి. నల్లని కురులు గాలిలో కదలాడుతున్నాయి. ఆమె రూపాన్ని రెప్పవేయకుండా చూస్తున్నకొద్దీ శంతన మహారాజుకి సందేహం కలిగింది.

ఈమె మానవకాంత కాదు. ఏ వనదేవతో, ఏ నాగకన్యకో అయి ఉండ వచ్చు. ఈమె శరీరచ్ఛాయ, రూపరేఖా విలాసాలు ప్రత్యేకతని సంతరించు కున్నాయి. ఏ దేవకాంతో దివినుంచి భువికి విహారానికి వచ్చిందేమో!

దగ్గరగా వచ్చిన ఆమెకేసి మరీ ఆశ్చర్యంగా చూశాడు శంతనుడు. ఆమె శంతనుడి యౌవన రూప సౌందర్యాలపైనే దృష్టిని కేంద్రీకరించింది. ఆమె చూపుల్లో నిశ్చలత, ధైర్యం, ఆత్మవిశ్వాసం కనిపించాయి శంతనుడికి. ఆమె చూపుల్లో ఏదో తృప్తి, ఏదో పోగొట్టుకుని తిరిగి సంపాదించుకున్న ఆనందం కనిపించాయి అంతలోనే అతనికి. అతనూ అలాగే ఆమెను చూస్తున్నాడు ఆ చూపులు కలిశాయి.

''నీ వెవరు?'' అని అడుగుదామని అనుకుంటున్నాడు శంతనుడు. కానీ ఆమె ఒక అడుగు ముందుకువేసి - కళ్ళలో కళ్ళుపెట్టి చూస్తూ ''నన్ను భార్యగా స్వీకరిస్తే-'' మాటలు అక్కడ ఆపింది.

"నిన్ను భార్యగా స్వీకరించడంకన్నా మహాభాగ్యమింకేదీ?" ఆనందంతో మాటలు తడబడ్డాయి. ఈ హఠాత్సంఘటన శంతనుణ్ణి ఆవేశపరవశుణ్ణి చేసింది.

ఆమె గలగలా నవ్వింది. ''ఒక్క మాట!'' ... వీణ మీటినట్టే విని పించింది అతని చెవులకి.

"నా ఇష్టాన్ని ఎప్పుడూ కాదనకూడదు...నేనేం చేసినా వారించకూడదు."

శంతనుడు ఆమెవైపే చూస్తున్నాడు. ఆ సౌందర్యారాధనలో కరిగి పోతున్నాడు.

"ఎప్పుడూ, దేనికీ కాదనను. నువ్వు నా దేవివైతే నీ ఇష్టమే నా ఇష్టం! నా ప్రణయినికోసం ఏం చేయమన్నా చేస్తాను.'' శంతనుని మాటలు వింటూ చిరునవ్వు నవ్వింది.

''ఎప్పుడైనా, ఎందుకైనా నన్ను వారిస్తే నిన్ను వదలివెళ్ళిపోతాను'' ఆమె శంతనుడికేసి చూస్తూ అంది. ఆ రూపం ఎక్కడో - ఎప్పుడో, చూసినట్టే అనిపించింది శంతనుడికి ఆ క్షణంలో.

శంతనుడికి వెంటనే గుర్తొచ్చింది - ఒకనాడు తండ్రి ప్రదీప మహారాజన్న మాట. ''ఏనాడైనా గంగాతీర ప్రాంతంలో ఒక అపురూప లావణ్యవతి ఎదురైతే ఏమీ ప్రశ్నించకుండా వివాహం చేసుకో!" ఆ మాట నిజమైందే! - శంతనుడు ఆమె ప్రవృత్తికి ఆశ్చర్యపోతూనే ఆమెతో సహజీవనం చేసే అదృష్టం కలిగి నందుకు ఆనందభరితుడయ్యాడు.

శంతనుడి దాంపత్య జీవితం మధురాతిమధురంగా సాగింది. భర్త ప్రేమానురాగాలకు పాత్రురాలైంది ఆమె.

ఆనాటి నీరెండలో ఆమె చెక్కిళ్ళ నిగనిగలు, కళ్ళ తళతళలు చూస్తూంటే ఆమెను కొత్తగా చూస్తున్న అనుభూతి కలిగింది శంతనుడికి. ఆ చూపులకి ఆమె శరీరం పులకించింది

గర్భవతిగా ఆమె సౌందర్యం రోజురోజుకి ఇనుమడిస్తోంది. ఆమె గర్భాన ఎంతటి గొప్పవాడు జన్మిస్తాడో అని ఊహిస్తూ పొద్దస్తమానం గడుపుతున్నాడు శంతనుడు.

మగశిశువుని ప్రసవించింది ఆమె. ఆ శిశువు పసిడి ముద్దలా మిస మిస లాడుతున్నాడు. ఆ శుభ సమయంకోసం ఎదురు చూస్తున్న శంతనుడి ఆనందం పట్టరానిదైంది.

పసికందును గుండెలకి హత్తుకుందామె. శంతనుడు ఆ పసివాడి లేత బుగ్గలు నిమిరాడు.

పసికందును చేతుల్లోకి తీసుకుందామె. వేగంగా బయటకు నడుస్తుంటే విస్తుపోయి చూస్తున్నాడు శంతనుడు.

ఆమె అలా వెళ్ళి వెళ్ళి గంగానదీ తీరాన నిలిచింది. ఆమె ముఖం ఒక్కసారి వివర్ణమైంది. మరుక్షణంలో తేరుకుని - పసికందును నదిలో వదిలేసింది!

ఒట్టి చేతులతో తిరిగి వచ్చిన పచ్చి బాలెంతను చూస్తూ - నిప్పులు కురిశాయి శంతనుడి కళ్ళు. గుండె భగ భగ మండిపోయింది. అంతే! - ఆ గుండె దాటి వాటిని చేరిన మాటలు అక్కడే స్తంభించిపోయాయి.

ఈ దారుణాన్ని చూస్తూ భరించే మనస్థైర్యం ఎక్కడి నుంచి వచ్చిందో అంతుపట్టలేదు శంతనునికి. ఆనాడు ఆమెకు చేసిన వాగ్దానం అతన్ని కట్టిపడేసింది. శంతనుడు దీర్ఘంగా నిట్టూర్చి మనసులోని ఉద్వేగాన్ని ఉపశమింపజేసుకున్నాడు.

జరిగిన సంఘటనతో తనకేమీ సంబంధం లేనట్టుగా ఆమె మళ్ళీ శంతనుడి మనసుకి చేరువైంది.

ఋతువులు గడిచాయి. మళ్ళీ శంతనుని కళ్ళలో ఆశాంకురాలు తలెత్తాయి. ఆమె ప్రసవించే రోజులు దగ్గరవుతున్న కొద్దీ శంతనుని మనసులో భయాందోళనలు ఎక్కువయ్యాయి. "ఈ మాటు పుట్టే బిడ్డను నా సంరక్షణలో దాచుకుంటాను - అనుకుంటూ ఆమెకేసి చూశాడు శంతనుడు - "ఇంత నిర్మలమైన మూర్తికి అంత కఠినమైన మనసెలా ఇచ్చాడో ఆ భగవంతుడు!" అనుకున్నాడు.

నిండు గర్భిణి శంతనుడికేసి చూచి చిరునవ్వు నవ్వింది.

మరో మగ బిడ్డను ప్రసవించిందామె. శంతనుడి ఆనందానికి హద్దుల్లేవు. పసి గుడ్డును చేతుల్లోకి తీసుకుంది మళ్ళీ. తిన్నగా నదీ ఒడ్డుకి నడిచింది... వట్టి చేతుల్తో అడుగు పెడుతున్న ఆమెను చూస్తూ అవాక్కయి పోయాడు శంతనుడు.

ఈ రాక్షసాన్ని చూస్తూ ఊరుకోవడమా?...మాట తప్పి ఆమెని పోగొట్టుకోవడమా?... శూన్యంలోకి చూస్తూ నిస్సహాయంగా ఉండిపోయాడు శంతనుడు.

ఆమె పిల్లల్ని కంటూనే ఉంది. అంతా వంశోద్ధారకులు, మగపిల్లలే-ఒకళ్ళా ఇద్దరా, ఏడుగురు!

శంతనుడికి సహనం నశించింది. ఇంత అధర్మాన్ని భరించే శక్తి ఇక తన మనసుకి లేదు. ఆమె ప్రవర్తన ఎంత దుఃఖాన్ని కలిగిచినా ఇంతవరకూ సహించాడు. మాట నిలబెట్టుకోవడం కోసం మనసు చంపుకున్నాడు తను. శంతనుడు మనసులో నిశ్చయించుకున్నాడు.

భర్త ముఖకవళికలు గమనిస్తున్న ఆమె మనసుకి బాధ కలిగింది - కానీ అంతా విధి నిర్ణయం!

ఓ శుభోదయాన మగ బిడ్డని ప్రసవించింది మళ్ళీ ఆమె. ఆమె ఏం చేయబోతోందో తెలుసు శంతనునికి. పసికూనని చేతుల్లోకి తీసుకోగానే శంతనుని కళ్ళు అగ్ని వర్షం కురిశాయి.

"దేవీ! - నువ్వు స్త్రీవా? తల్లివా? ఏడుగురు కొడుకుల్ని గంగపాలు చేసిన పుత్రఘాతివి - ఈ ఘోరాన్ని నేను ఇక భరించను!"

శంతనుడి గర్జన విందామె. శంతనుడి మోములో దైన్యాన్ని చూసిందామె.

శంతనుడికేసి ప్రశాంతంగా చూసింది.

"ఈ పసివాణ్ణి నదిలో పారేయను - నేనే పెంచి పెద్దచేసి నీ కిస్తాను"

శంతనుడి ముఖంలో ఆనందరేఖలు వెల్లివిరిశాయి.

"కానీ - నా కిచ్చిన వాగ్దానం విస్మరించావు - నన్ను వారించావు ఇక ఒక క్షణం కూడా ఉండను ఇక్కడ."

శంతనుడు వివర్ణుడయ్యాడు. ఈమె తనను వదిలి వెళ్ళిపోతుందా? ఆమెను వెళ్ళవద్దని ఎంతగానో వారించాడు.

పసివాణ్ణి చేతుల్లోకి తీసుకుందామె. క్షణం ఆగింది.

"నేనెవ రనుకున్నావ్? త్రిభువన పావనియైన గంగను. వసిష్ఠ శాపం పొందిన వసువులకు జన్మనిచ్చి నువ్వు తరించావు. నా అష్టమ గర్భాన జన్మిం చినవాడు ప్రసిద్ధుడై కలకాలం జీవిస్తాడు. వీణ్ణి పెంచి, విద్యా బుద్ధులు గరిపి తిరిగి నీకు అప్పగిస్తా."

గంగ సానునయంగా పలికి - చరచరా నడిచి వెళ్ళిపోయింది.

తన దాంపత్య జీవితం అలా ముగుస్తుందని ఎన్నడూ ఊహించని శంత నుడు నిశ్చేష్టుడయ్యాడు.

గంగా వియోగ తప్తుడై, ఆ ఇసుక తిన్నెలలో ఒంటరిగా కూర్చుని- మిలమిలా మెరిసే ఆ గంగానదీ జలాలను అశ్రునయనాలతో చూస్తూ కాలం గడిపాడు శంతనుడు.

*

(ఆధారం : కవిత్రయం వారి శ్రీ మదాంధ్ర మహాభారతం: ఆదిపర్వం : చతుర్థాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 20-1-1988)